నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, శుక్రవారం 1 మార్చి 2024 | HYDERABAD

ఆర్కేపురంలోని కుర్తాళం పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి విశేష 18 రకముల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. లలిత విష్ణు సహస్రనామం, కుంకుమార్చన నిర్వహించారు.
-ఆర్కేపురం, ఫిబ్రవరి 29

గురువారం సికింద్రాబాద్ పీజీ కళాశాల ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బందితో పాటు వారి పిల్లలకు ట్రాఫిక్-1 డీసీపీ సుబ్బారాయుడు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమం అనంతరం ట్రాఫిక్ సిబ్బంది హెల్మెట్లు ధరించి ర్యాలీ తీశారు.

ప్రతి ఆదివారం..
పరిష్కార వేదిక

సిటీబ్యూరో, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : బల్దియాలో ఆస్తిపన్నుపై ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి ఆదివారం 30 సర్కిల్ కార్యాలయాల్లో 'ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం' వేదికలను నిర్వహించనున్నట్లు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ నెలలో ఐదు అదివారాలు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 3, 10, 17, 24, 31వ తేదీల్లో ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కార కార్యక్రమం ఉంటుందని, వినియోగదారులు అసెస్‌మెంట్లలో లోపాలతో పాటు ఇతరత్రా సమస్యలను పరిష్కరించుకోవాలని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

నిందితుడు సురేశ్

బాలిక నగ్న చిత్రాలు పంపించి..

బేగంపేట్ ఫిబ్రవరి 29: ఓ బాలిక నగ్న చిత్రాలను ఆమె తండ్రికి పంపించి డబ్బులు డిమాండ్ చేస్తున్న యువకుడికి నాంపల్లి 12వ మెట్రోపాలిటన్ న్యాయస్థానం మూడేండ్ల జైలు శిక్షతో పాటు 5వేల జరిమానా విధించింది. బేగంపేట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట్ శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతంలో ఉంటున్న వ్యక్తి కుమార్తెతో అదే ప్రాంతంలో ఉండే సురేశ్(21) చనువుగా ఉండి.. ఆమె నగ్న ఫొటోలను సేకరించాడు. వాటిని బాలిక తండ్రికి పంపించి డబ్బులు డిమాండ్ చేశాడు. బాధితుడు బేగంపేట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకున్నారు. న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో కోర్టు.. నిందితుడికి శిక్షను ఖరారు చేసింది.

బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకొని.. బలవన్మరణం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 29: బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఫిలింనగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఫిలింనగర్‌లోని వినాయక్‌నగర్‌లో ఉంటున్న సూర్యనగేశ్ (23) కొంతకాలంగా బెట్టింగ్‌లకు బానిసై.. పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో ఆరు నెలల కిందట ఆత్మహత్యకు యత్నించాడు. సకాలంలో ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. కాగా, గతంలో చేసిన అప్పుల భారం ఎక్కువ కావడంతో తీవ్ర మనోవేదనకు గురైన సూర్యనగేశ్.. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జీహెచ్ఎంసీలో ఎక్స్‌టెన్షన్ అధికారులపై వేటు

సిటీబ్యూరో,ఫిబ్రవరి29 (నమస్తే తెలంగాణ) :జీహెచ్ఎంసీ ఎక్స్‌టెన్షన్ మీద కొనసాగుతున్న అధికారులను శాశ్వతంగా ఇంటికి పంపించే చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఓఎస్‌డీ సురేశ్ కుమార్‌ను బాధ్యతల నుంచి తప్పించగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో దాదాపుగా 44 మంది ఎక్స్‌టెన్షన్ అధికారులను శుక్రవారం విధులకు హాజరుకావద్దంటూ అడ్మిన్ విభాగం సమాచారం చేరవేసింది. మొత్తంగా ఈనెల మొదటివారం నాటికి ఎక్స్‌టెన్షన్ అధికారులకు శాశ్వతంగా స్వస్తి పలుకనున్నారు.

హయత్‌నగర్‌లో 'సీఎంఆర్'

హయత్‌నగర్‌లో సినీతారలు ఆషికా రంగనాథ్, అమృతా అయ్యర్ సందడి చేశారు. భాగ్యలత కమాన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం అభిమానులకు అభివాదం చేసి.. ఫొటోలకు పోజులిచ్చారు. కార్యక్రమంలో సీఎంఆర్ ఫౌండర్ అండ్ చైర్మన్ వెంకటరమణ, ఎండీ మోహన్ బాలాజీ, కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- వనస్థలిపురం, ఫిబ్రవరి 29

• ఆల్ ది బెస్ట్

నగరంలో ఇంటర్ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. గురువారం ట్రాఫిక్ సిబ్బంది పరీక్ష రాసేందుకు వస్తున్న ఓ స్టూడెంట్‌ను ప్రోత్సహిస్తూ.. ఇలా ప్లకార్డుతో స్వాగతం పలుకుతున్న దృశ్యమిది.

నో టెన్షన్

పరీక్ష సమయం..ఆత్మస్థైర్యమే ఆయుధం
విద్యార్థులకు ఉచిత కౌన్సెలింగ్ సేవలు ప్రారంభం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారు. ఆందోళనకు గురై పరీక్ష రాయడంలో తడబడుతుంటారు. చదివింది గుర్తుండటం లేదని ఆందోళన చెందుతుంటారు. టెన్షన్‌తో నిద్ర సరిపడా లేక మరింత నీరసించిపోతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతిని పరీక్ష శ్రద్ధగా రాయలేకపోతుంటారు. అలాంటి వారిలో మానసిక స్థైర్యం నింపేందుకు తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ ముందుకొచ్చింది. మార్చి నెల పరీక్షల సమయం కావడంతో ఉచితంగా విద్యార్థులకు కౌన్సిలింగ్ సేవలు ప్రారంభించారు. పరీక్షలకు సంబంధించి ఆందోళనకు గురయ్యే వాళ్లు సైకాలజిస్టులతో మాట్లాడితే మనసుకు ప్రశాంతత చేకూరుతుందని తద్వారా ఆత్మస్థైర్యం పెరిగి పరీక్ష బాగా రాయడానికి దోహదపడుతుందని అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ మోత్కూరి రాంచందర్ తెలిపారు.

సేవలు అందించే వారి సమాచారం

డాక్టర్ ఎం.రాంచందర్	9533660938
డాక్టర్ లావణ్య	9908987770
డాక్టర్ శ్రీపూజ	9246155955
ప్రతిమ	9553484643
విజయ	7032226942
శ్రీదేవి	8374685999
కీర్తి	9550183838
సునాయన	8008231699
సాహితీ	7993715081
అశ్విని	9032248100

ఫింగర్ ప్రింట్స్ పనికట్టు!

జీహెచ్ఎంసీలో జిమ్మిక్కులు

బినామీ పేర్లతో నకిలీ వేలి ముద్రలు
విధులకు హాజరవుతున్నట్లు అటెండెన్స్
జీహెచ్ఎంసీ నుంచి వేతనాలు డ్రా
టాస్క్‌ఫోర్స్ అదుపులో ముఠా

సిటీబ్యూరో, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): పనిచేయకుండానే పనిచేసినట్లు నకిలీ ఫింగర్ ప్రింట్స్‌ను ఉపయోగించి రోజు వారీగా విధులకు హాజరైనట్లు రికార్డుల్లో చూపిస్తూ..బల్దియాకు గండి కొడుతున్న ముఠాను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బల్దియాలోని శానిటేషన్ విభాగంలో పనిచేసే స్వీపర్లు క్షేత్రస్థాయిలో హాజరవుతుంటారు. వీళ్లను జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తుంటారు. శానిటరీ సిబ్బంది బృందాలుగా ఉంటారు. ఒక్కో బృందంలో 12 నుంచి 16 మంది సిబ్బంది ఉంటారు. అయితే రోజు వారీగా విధులకు వచ్చిన రోజు బయోమెట్రిక్‌తో హాజరు తీసుకుంటారు. దీని ఆధారంగానే నెలల్లో సిబ్బంది ఎన్ని రోజులు హాజరయ్యారనే విషయాన్ని పరిగణలోకి తీసుకొని వేతనాలు చెల్లిస్తుంటారు. ఇదే అదునుగా భావించిన సర్కిల్-16, సర్కిల్-14లోని కొందరు శానిటరీ కాంట్రాక్టర్లు, అధికారులు కలిసి పారిశుధ్య పనులు చేసే బృందాల్లో కొందరు బినామీ పేర్లను జోడించారు. వాళ్లకు సంబంధించిన నకిలీ ఫింగర్ ప్రింట్స్ తయారు చేశారు. ఆ బినామీలు రోజు వారీగా విధులకు హాజరవుతున్నట్లు అటెండెన్స్ వేస్తూ, నెల వారీగా వారి పేర్లపై వేతనాలు డ్రా చేస్తున్నారు. కొన్ని నెలలుగా ఈ తతంగం నడుస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 40 వరకు నకిలీ ఫింగర్ ప్రింట్స్‌ను సేకరించినట్లు సమాచారం. ఈ దందాలో ఇంకెవరు ఉన్నారు..? కాంట్రాక్టర్లు, సిబ్బంది పాత్రపై పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవం..?

పోటీ నుంచి తప్పుకునేందుకు నలుగురు కార్పొరేటర్లు సిద్ధం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఎప్పటిలాగే ఈ సారి కూడా ఏకగ్రీవం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ జరిగింది. 15 మంది సభ్యులకు 19 మంది దరఖాస్తులు సమర్పించారు. బీఆర్ఎస్ నుంచి 10, ఎంఐఎం ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో భాగంగానే గడిచిన రెండు రోజులు దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు శనివారం లోగా ఉపసంహరణ గడువు ఉంది. దీంతో కాంగ్రెస్ నుంచి వేసిన ఇద్దరు కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, ఈఎస్ రాజ్ జితేంద్రనాథ్, బీఆర్ఎస్ నుంచి కార్పొరేటర్లు సబితా కిశోర్, లావణ్య దూసరి నామినేషన్ ఉపసంహరించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటల తర్వాత బరిలో 15 మంది ఉంటే.. ఎన్నిక ఏకగ్రీవం అని అధికారులు ప్రకటించనున్నారు. లేని పక్షంలో పోటీలో 15 మంది కన్నా ఎక్కువ మంది నిలిస్తే 7న జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామని అధికారులు చెప్పారు. పోటీ లేకుంటే ఎన్నిక ఏకగ్రీవమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

ట్రాన్స్‌జెండర్ కోసం వెళ్లి..ముఠాకు చిక్కి

పంజాగుట్టలో దారి దోపిడీ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 29 : ట్రాన్స్‌జెండర్ కోసం వెళ్లిన ఓ వ్యక్తి దొంగల చేతికి చిక్కాడు. ఆ దుండగులు అతడిపై దాడి చేసి సెల్‌ఫోన్ లాక్కెళ్లారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. డీఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...నగరంలోని ఎల్లమ్మబండకు చెందిన ధుదాని బహదూర్‌సింగ్, తిల్పితియా గురుదార్ సింగ్ అలియాస్ గురుదేవ్ సింగ్ పాత నేరస్తులు. అదే ప్రాంతానికి చెందిన మోదీమ్ తుల్జారామ్, వారి స్నేహితులైన చాంద్రాయగుట్టకు చెందిన తేకు నవీన్, సయ్యద్ గౌస్ పాషా, షేక్ అల్తాఫ్ అలియాస్ మస్తాన్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. దోపిడీ కోసం కత్తులను సైతం కొనుగోలు చేశారు. ఈ క్రమంలో ఎర్రమంజిల్ మెట్రో స్టేషన్ వద్దకు ఆటోలో చేరుకున్న ఆ ముఠా.. దారి దోపిడీ కోసం సిద్ధమైంది. ఆ సమయంలో నగరానికి చెందిన నరేశ్ కుమార్ ఎర్రమంజిల్ మాల్ వద్ద ట్రాన్స్‌జెండర్‌తో కలిసి ఉండటాన్ని గమనించారు. వెంటనే అక్కడికి చేరుకొని తమ వెంట తెచ్చుకున్న కత్తితో బెదిరించి దాడి చేసి కొట్టారు. అతడిని కిందపడేసి సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితులను పట్టుకున్నారు. కాగా, నరేశ్ కుమార్ ట్రాన్స్‌జెండర్ కోసం వెళ్లగా, ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. గురువారం నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసిన సింగపూర్ ప్రతినిధులు

ప్రపంచ నగరాల శిఖరాగ్ర సదస్సుకు రండి

మేయర్ విజయలక్ష్మిని ఆహ్వానించిన సింగపూర్ ప్రతినిధులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): సింగపూర్‌లో 2024 జూన్ 2 నుంచి 4 వరకు జరగనున్న 9వ ప్రపంచ నగరాల శిఖరాగ్ర సదస్సులో పాల్గొనాల్సిందిగా సింగపూర్ కౌన్సిల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ హైదరాబాద్ నగర గద్వాల్ విజయలక్ష్మిని కలిసి ఆహ్వానించారు. నివాసయోగ్యమైన, స్థిరమైన నగర సవాళ్లను పరిష్కరించడానికి, ఇంటిగ్రేటెడ్ అర్బన్ సొల్యూషన్స్ పంచుకోవడానికి, కొత్త భాగస్వామ్యాలను రూపొందించడానికి మేయర్లు, వ్యాపారవేత్తలు, పట్టణ నిపుణులతో ఈ ప్రపంచ నగరాల సదస్సు ఒక వేదికగా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ వేదికలో వివిధ అంశాలపై మేయర్లు, బిజినెస్ లీడర్లు, పట్టణ నిపుణులతో స్మార్ట్, పునరుత్పత్తి నగరాలను సాధించడానికి గల అవకాశాలు, స్మార్ట్ సిటీల లక్ష్య సాధనకు పొల్యూషన్, ప్రస్తుతం భవిష్యత్‌లో అందరికీ మంచి నగర జీవితాన్ని అందించడంపై చర్చించనున్నట్లు చెప్పారు. తమ ఆహ్వానాన్ని స్వీకరించి, సింగపూర్ డబ్ల్యూఎస్‌కు వచ్చి నగరాలను మరింత ఉన్నతంగా తీర్చిదిద్ది, సుస్థిరంగా ఎలా మార్చవచ్చన్న అంశంపై అమూల్యమైన సందేశాన్ని, సలహాలు, సూచనలు ఇవ్వాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కోరారు. హైదరాబాద్ నగరంలో జరిగిన అభివృద్ధిని ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వారికి వివరించారు. నగరాన్ని అత్యున్నత నగరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, సిగ్నల్ ఫ్రీ నగరంగా అభివృద్ధి చేసినట్లు మేయర్ చెప్పారు. కార్యక్రమంలో వైస్ కౌన్సిల్ మిస్ నికోల్ చెన్ తదితరులు పాల్గొన్నారు.

డామిట్.. కథ అడ్డం తిరిగింది..

పాపులారిటీ కోసం.. హత్యాయత్నం డ్రామా
ఫిర్యాదు చేసి..పోలీసులకు దొరికిపోయిన వైనం

ఉప్పల్, ఫిబ్రవరి 29 : పాపులారిటీ, రాజకీయ ప్రయోజనం కోసం ఓ వ్యక్తి తనపై హత్యాయత్నం జరిగినట్లు డ్రామా ఆడాడు. స్నేహితులతో కలిసి ప్రణాళిక రచించి.. మీడియాలో వైరల్ చేసుకొని..చివరికి పోలీసులకు దొరికిపోయాడు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం మల్కాజిగిరి డీసీపీ పద్మజ వివరాలు వెల్లడించారు. బోడుప్పల్‌కు చెందిన ఎల్లగొని ఉదయ్‌భాస్కర్(43)కు పలు వ్యాపారాలు ఉన్నాయి. పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు, రౌడీషీట్ కూడా ఉంది. అయితే పాపులారిటీ, రాజకీయ ప్రయోజనాల కోసం.. హత్యాయత్నం డ్రామా ఆడాలని ప్లాన్ వేశాడు. ఈ విషయాన్ని స్నేహితులతో కలిసి చర్చించాడు. ఈ క్రమంలో రూ. 2.5 లక్షలతో ఒప్పందం కుదిరింది. 50వేలు అడ్వాన్స్ కూడా ఇచ్చాడు. ఉప్పల్ భగాయత్ ప్రాంతాన్ని ఎంచుకున్నారు. ఉదయ్‌భాస్కర్ కాలభైరవ ఆలయానికి వచ్చి పూజలు చేస్తుంటాడు. ఈ ప్రాంతంలో అటాక్ అయితే బాగుంటుందని భావించారు. ప్లాన్ అమల్లో భాగంగా ఈ నెల 24న కారులో వస్తున్న ఉదయ్‌భాస్కర్‌ను మాస్కులు ధరించిన వ్యక్తులు అడ్డగించారు. కారు అద్దాలు పగలగొట్టి..కత్తితో దాడి చేశారు. ఉదయ్‌భాస్కర్ తనపై హత్యాయత్నం జరిగినట్లు వైరల్ చేసుకొని.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో అదంతా ఫేక్ అని తేల్చిన పోలీసులు.. ఉదయ్‌భాస్కర్‌ను, అతడికి సహకరించిన శివకిశోర్(33), యాదగిరి(38), అరుణ్(35), సృజన్‌రెడ్డి(30), ప్రశాంత్(28)లను అరెస్టు చేశారు. మరో ఇద్దరు సంతోష్‌రెడ్డి, మహేశ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వాహనాలు, డబ్బులు సీజ్ చేశామన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల మీద దాడి

చోర్ అబ్బూతో సహా ఐదుగురు అరెస్ట్



బంజారాహిల్స్,ఫిబ్రవరి 29: జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యకర్తలను కిడ్నాప్ చేసి.. దాడికి పాల్పడిన ఘటనలో బోరబండ కాంగ్రెస్ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ ప్రధాన అనుచరుడు చోర్ అబ్బూతో సహా ఐదుగురు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సయ్యద్ అక్బర్, సాయితేజపై చోర్ అబ్బూ శ్రీనాథ్, అవేజ్, అల్తాఫ్, చక్కా సాయి, శ్రీకాంత్‌లతో కలిసి కిడ్నాప్ చేసి..దాడికి పాల్పడ్డారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ..నిందితులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు అవేజ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, చోర్ అబ్బూ, చక్కా సాయిపై గతంలో పలు పోలీస్‌స్టేషన్లలో క్రిమినల్ కేసులు ఉన్నట్లు విచారణలో తేలింది.